# సాక్షి గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం | 3 | ఆగస్టు | 2023






**భద్రత లేని బస్సు..**
ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా పరిమితికి మించి విద్యార్థులను బస్సుల్లో తరలించడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

- 8లో▸



**పలు రైళ్లకు హాల్టింగ్**
డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో నేటి (గురువారం) నుంచి పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32°/25°

**వాతావరణం**
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా జిల్లాలో ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

# నష్టం.. అపారం ప్రస్తావిస్తేనే పరిష్కారం!

**నేటి నుంచే అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు**
- ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వరదలు.. అంతటా కన్నీటి నుడులు
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే పనిలో ఎమ్మెల్యేలు
- కొద్ది రోజుల్లోనే ఎన్నికలు.. ఇవే చివరి సమావేశాలు
- పెండింగ్ పనులపై స్పందించాలి






వరంగల్ నగరంలో ఇటీవల కురిసిన వర్షానికి ముంపునకు గురైన కాలనీలు.. (ఫైల్)

సాక్షిప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు గురువారం నుంచి మొదలుకానున్నాయి. కొద్ది రోజుల్లోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నిర్వహించే ఈ సమావేశాలు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కీలకం కానున్నాయి. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బరిలో నిలిచే ఆశావహులు ఈ సమావేశాల్లో గళం వినిపించేందుకు సన్నద్ధమయ్యారు. తమ నియోజకవర్గాల్లో అమలైన అభివృద్ధి పనులు.. పెండింగ్ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు చేసిన అభివృద్ధిని వినిపించేందుకు సమయం కోరారు. ప్రధానంగా జూలై 15 నుంచి 27 వరకు కురిసిన వర్షాలు, వరదలు, నష్టాలు ఈసారి ప్రధాన అంశాలు కానున్నాయి. ఈమేరకు నష్టాలపై మాట్లాడేందుకు ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అధికారుల నుంచి సమాచారం తీసుకున్నారు. మంత్రి, అధికార ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధి పనులు, చేపట్టిన సహాయక చర్యలను వివరించడంతో పాటు ఆర్థిక సాయం కోరేందుకు సిద్ధమయ్యారు.

**వరదల నష్టం అపారం..**

ఉమ్మడి వరంగల్‌లో 12 రోజుల పాటు వర్షాలు దంచికొట్టాయి. ములుగు ఏరియాలో అత్యధికంగా 64 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. వరంగల్ మహానగరంలో 200 కాలనీలు మూడు రోజుల పాటు ముంపులో ఉన్నాయి. మోరంచపల్లి, కొండాయి గ్రామాలు సర్వస్వం కోల్పోగా.. అక్కడి ప్రజలు ఇంకా కోలుకోవడం లేదు. ఒక్క గ్రేటర్ వరంగల్ పరిధిలోనే సుమారు రూ.500 కోట్ల మేర నష్టం జరిగినట్లు అంచనాకు వచ్చారు. ఇక ఉమ్మడి జిల్లా మొత్తంగా 1,000 నుంచి రూ.1200 కోట్లకుపైగా నష్టం జరిగినట్లు అంచనా. 61,234 ఎకరాల్లో వరి, పత్తి వివిధ రకాల పంటలు దెబ్బతినగా 23,412 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. 122 కిలోమీటర్ల మేర పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లు దెబ్బతినగా, 301 చెరువులు, కుంటలకు గండ్లు పడ్డాయి. ఎన్పీడీసీఎల్‌కు రూ.18 కోట్ల మేర నష్టం వాటిల్లింది. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో రహదారులకు బుంగలు పడి, ఐదు చోట్ల వంతెనలు కూలిపోయాయి. 28 మంది మృత్యువాత పడగా.. కుటుంబాలు ఆగమాగం అయ్యాయి. వరద నష్టాలను ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో ప్రస్తావించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది.



## మన ఎమ్మెల్యేలు ఏమంటున్నారంటే..

**ఈ అసెంబ్లీ సమావేశాలు చరిత్రాత్మకం**



సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఈసారి జరిగే అసెంబ్లీ సమావేశాలు మరింత చరిత్రాత్మకం కానున్నాయి. ఈసారి ప్రవేశపెట్టే బిల్లుల్లో ఉమ్మడి వరంగల్‌కు ప్రయోజనం కలిగించేవి ఉంటాయి. వరద సాయం కోసం ప్రకటించిన రూ.500 కోట్లలో ఉమ్మడి వరంగల్ వాటాతోపాటు నష్టాలను వివరించి మరిన్ని అదనపు నిధులు ఇచ్చేలా కృషి చేస్తాం. పాలకుర్తి నియోజకవర్గంలో సుమారు రూ.1,000 కోట్ల వివిధ అభివృద్ధి పనులు చేపట్టాం.

- ఎర్రబెల్లి దయాకర్‌రావు, మంత్రి, ఎమ్మెల్యే, పాలకుర్తి

**ముంపు సమస్యపై మాట్లాడతా..**



ప్రధానంగా భారీ వర్షాలు, పెద్ద ఎత్తున వచ్చిన వరదలకు వరంగల్ నగరం అతలాకుతలమైంది. పశ్చిమ నియోజకవర్గంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల వాటిని పరిశీలించాము. కాలనీల ముంపు సమస్య, వరదల తీవ్రత, శాశ్వత పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం, సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు తీసుకువస్తా. ముంపు నివారణకు శాశ్వత పరిష్కారంపై చర్చిస్తా.

- దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్యే, వరంగల్ పశ్చిమ

**నష్టం అంచనాలతో వెళ్తున్నా..**



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వర్ధన్నపేట నియోజకవర్గంలో భారీ నష్టం వాటిల్లింది. తాత్కాలికంగా పనులు చేపట్టాం. పంట పొలాలు, చెరువులు, కుంటలు, రహదారులు, వర్ధన్నపేట మున్సిపాలిటీలో, వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని జరిగిన నష్టాల అంచనాలు తయారు చేశాం. నియోజకవర్గంలో సుమారు రూ.400 కోట్ల నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయి. దీన్ని సభ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తా.

- అరూరి రమేశ్, ఎమ్మెల్యే, వర్ధన్నపేట

**ఈ సమావేశాల్లో గుడ్ న్యూస్ వస్తదని ఆశిస్తున్నా**



ఈ అసెంబ్లీ సమావేశాల్లో మరో గుడ్‌న్యూస్ వస్తదని ఆశిస్తున్నా. అది జీపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, హోంగార్డులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలను కూడా సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో పర్మనెంట్ చేస్తూ బిల్లు పెడతారని భావిస్తున్నా. పరకాల నియోజకవర్గానికి మరిన్ని నిధులు వచ్చేలా కృషి చేస్తా. ఇటీవల వర్షాల వల్ల కూడా చాలా నష్టం జరిగింది. ఇప్పటికే వాటి వివరాలు సేకరించాం. ప్రభుత్వానికి కూడా నివేదిక పంపించాం.

- చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్యే, పరకాల

# విద్యార్థులకు రాగి జావ

- జిల్లాలో 485 పాఠశాలలు
- లబ్ధిపొందనున్న 37,158 మంది విద్యార్థులు



విద్యారణ్యపురి: విద్యాదినోత్సవం జూన్ 20న ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావా అందించి లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆతర్వాత హనుమకొండ జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో కొద్ది రోజులు మాత్రమే రాగి జావా అందించారు. రాగిపిండి, బెల్లం రాకపోవడంతో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో జూలై 1 నుంచి అమలు చేస్తామని ప్రకటించించారు. కానీ అమల్లోకి రాలేదు. ఇటీవల డీఈఓ కార్యాలయానికి రాగిపిండి ప్యాకెట్లు బస్తాల్లో చేరుకున్నాయి. రాగిజావలో బెల్లం వినియోగించాలని బెల్లాన్ని కూడా ప్యాకెట్ల రూపంలో పంపించారు. హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ, లోకల్‌బాడీ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు కలిపి 485 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. అందులో 1 నుంచి 10వ తరగతి వరకు 37,158 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వర్తింపజేస్తున్నారు. వంట చేసే ఏజెన్సీలు 485 ఉన్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులు 980 మంది ఉన్నారు. వీరు రాగిజావా తయారు చేసి విద్యార్థులకు అందించనున్నారు. పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లంతో రాగిజావాను తయారు చేసి ఇవ్వనున్నారు. మధ్యాహ్న భోజనంలో మూడ్రోజులు గుడ్లు పెడతారు. మరో మూడ్రోజులు ఉదయం విద్యార్థులు పాఠశాలకు రాగానే రాగిజావా అందించనున్నారు. ఒకటి రెండ్రోజుల్లో ఎంఆర్సీ కేంద్రాలకు రాగిపిండి, బెల్లాన్ని పంపిణీ చేయనున్నట్లు సమాచారం. త్వరలోనే విద్యార్థులకు రాగిజావాను అందించనున్నారు.

**మధ్యాహ్నభోజన కార్మికులకు చీరలు..**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు చీరలు డీఈఓ కార్యాలయానికి చేరుకున్నాయి. ఒక్కొక్కరికి ఒక్కో చీర ఇవ్వనున్నారు.

## నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

ఎంజీఎం: జూలై 20న నిర్వహించాల్సిన డీ వార్మింగ్ మాత్రల పంపిణీ భారీ వర్షాల కారణంగా వాయిదా పడిందని, ఈకార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్) ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 1 నుంచి 19 ఏళ్ల పిల్లలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించి ఆల్బెండజోల్ మాత్రలు ఇప్పించాలని కోరారు. గురువారం మాత్రలు వేసుకోని పిల్లలకు ఈనెల 10న వేయనున్నట్లు తెలిపారు.

# కన్నీళ్లకు చలించిన గవర్నర్

- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ
- వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన





జవహర్‌కాలనీలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్





పోతననగర్‌లో ఓ ఇంట్లోకి వెళ్లి చూస్తున్న గవర్నర్, ముంపు తీవ్రతను వివరిస్తున్న బాధిత మహిళలు

వరంగల్ అర్బన్/హసన్‌పర్తి/కాజీపేట అర్బన్: 'పది రోజులుగా వాన నీళ్లలో నానుతున్నాం. రోజూ కూలీ చేసి కుటుంబాలను పోషించుకునే వాళ్లం. కట్టుబట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. మమ్మల్ని ఆదుకోవాలి' అని వరద బాధితులు గవర్నర్ ఎదుట కన్నీళ్లు పెట్టుకున్నారు. వారి కన్నీళ్లకు గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చలించిపోయారు. ప్రభుత్వాలకు నివేదికలు అందించి తన వంతుగా సాయం చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. వరంగల్ నగర పర్యటనలో భాగంగా బుధవారం పోతననగర్, ఎన్టీఆర్ నగర్‌లో గవర్నర్ పర్యటించారు. వరద బాధితులకు ఇండియన్, రెడ్‌క్రాస్ సొసైటీ సమీకరించిన ఆరోగ్య కిట్‌లు, కిరాణా సామగ్రిని పంపిణీ చేసి ఓదార్చారు. ఈసందర్భంగా గవర్నర్‌కు వరద బాధితులు వినతిపత్రాలు అందించారు. వరద బాధితులకు రక్షిత మంచినీరు సరఫరా చేయకపోవడం బాధాకరమన్నారు. పంట, ఆస్తి, పశువుల నష్టం, నిర్వాసితులు, పునరావాస కేంద్రాలకు తరలించిన వారి సంఖ్య వివరాలపై గవర్నర్ అధికారులను ఆరా తీశారు. ఎన్టీఆర్‌నగర్‌లో మీడియా సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. అతి భారీ వర్షాల కారణంగా వరద బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, పేదలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించకపోవడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఆగిపోయి వారం గడిచినా.. ఆప్రాంతాల్లో వరద నీరు తరలించేందుకు ప్రయత్నం చేయకపోవడం బాధాకరమన్నారు. కనీసం తినేందుకు తిండి లేక వారు పడుతున్న బాధలు దయనీయంగా ఉన్నాయన్నారు. ప్రతీ ఏడాది వరదలు వస్తున్నా.. ముందస్తుగా చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అధికారులు మేల్కోవాలని, విపత్కర పరిస్థితులను ముందస్తుగా పసిగట్టి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

**నిత్యావసర వస్తువుల పంపిణీ**

56వ డివిజన్ జవహర్ కాలనీ ప్రాంతాన్ని బుధవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు నిత్యావసర వస్తువులను గవర్నర్ అందించారు.

**ఘన స్వాగతం**

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు నిట్ క్యాంపస్‌లో పోలీస్ శాఖ గౌరవ వందనం సమర్పించింది. నిట్‌లోని కలాం గెస్ట్ హౌజ్‌లో హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తా పట్నాయక్ మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. శ్రమ శక్తి అవార్డు గ్రహీత, కార్మిక శాఖ రాష్ట్ర బోర్డ్ మెంబర్ కుసుమ శ్యాంసుందర్ మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో గవర్నర్ వెంట బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ విజయ్‌చందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ.శ్రీనివాస్, కార్యదర్శి వెంకటనారాయణ, కోశాధికారి రమేశ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడు నెలల ముందే 'కిక్కు' లక్కు!

**ఎక్సైజ్ టెండర్లకు వేళాయె**
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్‌షాపులు..
- 2021-23లో వైన్స్ టెండర్లతో ఖజానాకు రూ.198 కోట్లు
- రూ.59 కోట్లతో టాప్‌లో నిలిచిన వరంగల్ అర్బన్
- 2021-23 ఎక్సైజ్ పాలసీనే 2023-25లో కొనసాగింపు



కాజీపేట అర్బన్: ఎన్నికల ఎఫెక్ట్ అన్ని రంగాలతోపాటు ఎక్సైజ్ శాఖను సైతం తాకింది. నవంబర్ వరకు కొనసాగాల్సిన మద్యం దుకాణాలు మూడు నెలల ముందే లక్కు కిక్కును అందించనున్నాయి. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న ఆబ్కారీ శాఖను ముందుగా పలకరించింది. రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు ముందే రెండేళ్ల వైన్స్ టెండర్‌కు శ్రీకారం చుట్టి బుధవారం 2023–25 సంవత్సరాలకుగాను టెండర్ల ప్రకటన జారీ చేసింది. 2021–23 ఎక్సైజ్ పాలసీనే 2023–25 రెండేళ్ల కాల వ్యవధికి కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 4నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి 18వ తేదీ వరకు స్వీకరించనుంది. అర్బన్‌లో వైన్ షాపుల లైసెన్స్ ఫీజును రూ.85లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.65లక్షలుగా నిర్ణయించారు. 2021 ఎక్సైజ్‌పాలసీలో భాగంగా ఎస్సీలకు 10, గౌడలకు 15 శాతం, ఎస్టీలకు 5 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు.

**21న లక్కీ డ్రా..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్‌షాపులకు ఈనెల 21వ తేదీన ఆయా జిల్లాల్లోని కలెక్టర్ల చేత లక్కీ డ్రా నిర్వహించి షాపులను కేటాయించనున్నారు. లక్కీ డ్రాలో దక్కించుకున్న షాపులు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

**ఉమ్మడి వరంగల్ జిల్లాలో రిజర్వేషన్లు ఇలా..**

2021–23 ఎక్సైజ్ పాలసీలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, గౌడలకు ప్రత్యేక రిజర్వేషన్ కేటాయించిన విషయం తెలిసిందే. అదే పాలసీ 2023–25లోనూ కొనసాగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్ అర్బన్– గౌడలకు 15, ఎస్సీలకు 10, ఎస్టీలకు1, వరంగల్ రూరల్– గౌడలకు 14, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2, జనగామ– గౌడలకు 13, ఎస్సీలకు 5, ఎస్టీలకు 1, మహబూబాబాద్ – గౌడలకు 13, ఎస్సీలకు 6, ఎస్టీలకు 2, భూపాలపల్లి–గౌడలకు 9, ఎస్సీలకు7, ఎస్టీలకు 11 షాపులు కేటాయించారు.

**టెండర్ల ద్వారా ఖజానాకు రూ.198 కోట్లు..**

ఎక్సైజ్‌శాఖ ద్వారా 2021–23 రెండేళ్ల టెండర్లలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఉన్న 294 వైన్స్‌లకు టెండర్ల దరఖాస్తులు 9,950 రాగా ఖజానాకు రూ.198 కోట్ల ఆదాయం లభించింది. ఇందులో వరంగల్ అర్బన్‌లో 2,983 దరఖాస్తులు రాగా రూ.59కోట్ల ఆదాయంతో టాప్‌లో నిలిచింది.

**మూడు నెలల వరకు పాత స్టాకే..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 294 వైన్స్ నవంబర్ వరకు కొనసాగాల్సి ఉండగా ఎన్నికల సీజన్‌తో ముందస్తుగా మూడు నెలలముందే టెండర్ల పిలుపు వచ్చింది. అయినా మూడు నెలలపాటు పాత వైన్స్.. పాత లైసెన్స్‌తో, పాత స్టాక్‌తో కొనసాగుతాయి. 2023–25 టెండర్లలో వైన్స్ దక్కించుకున్న వారికి డిసెంబర్ 1 నుంచి నూతన లైసెన్స్‌తో షాపులు ప్రారంభమవుతాయి.

**నేడు ఎస్సీ, ఎస్టీ, గౌడలకు కేటాయింపు..**

ఉమ్మడి జిల్లాలోని 294 వైన్స్‌లకుగాను రిజర్వేషన్ ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, గౌడలకు ఆయా జిల్లాల కలెక్టర్లు గురువారం షాపులను కేటాయించనున్నారు.

**జిల్లాల వారీగా వైన్స్‌లు, దరఖాస్తుల ద్వారా ఆదాయం ఇలా..(రూ.కోట్లలో)**

| జిల్లా | వైన్స్‌లు | దరఖాస్తులు | ఆదాయం |
|---|---|---|---|
| వరంగల్ అర్బన్ | 65 | 2983 | 59.6 |
| వరంగల్ రూరల్ | 63 | 1793 | 35.8 |
| మహబూబాబాద్ | 59 | 1572 | 31.4 |
| భూపాలపల్లి | 60 | 1999 | 39.9 |
| జనగామ | 47 | 1603 | 32 |

## న్యూస్‌రీల్

**'తొలిమెట్టు' శిక్షణ ప్రారంభం**



విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని 14 మండలాల్లో ఉపాధ్యాయులకు తెలుగు సబ్జెక్టుపై తొలిమెట్టు శిక్షణ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంపొందించేందుకు చేపట్టిన మలి దశ శిక్షణ కార్యక్రమాలకు జిల్లాలో 14 మండలాల్లో కలిపి 403 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరైనట్లు జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని ధర్మసాగర్ మండల కేంద్రంలోని బాయ్స్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణలో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 28 మంది రిసోర్స్ పర్సన్లతో శిక్షణ కొనసాగింది. గురువారం తెలుగు సబ్జెక్టుపై శిక్షణ ఇస్తారని శ్రీనివాస్ తెలిపారు.

**ప్రారంభించిన డీఈఓ**

కాజీపేట: కాజీపేట మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం డీఈఓ అబ్దుల్‌హై తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. భాషా సామర్థ్యాలపై పట్టు పెంచుకునేందుకు ఏర్పాటు చేసిన 6 రోజుల శిక్షణ శిబిరాన్ని డీఈఓ ప్రారంభించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మనోజ్, రాధ, సంధ్యారాణి, రాజేంద్రం పాల్గొన్నారు.

**టెట్‌కు దరఖాస్తు చేసుకోవాలి**

విద్యారణ్యపురి: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ టెట్–23) హనుమకొండ జిల్లాలోని అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 2 నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. హెచ్‌టీటీపీఎస్://సీజీజీ.గౌట్.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఈఏడాది సెప్టెంబర్ 15న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఉంటుందని డీఈఓ తెలిపారు.

**నేడు ఇన్‌స్పైర్‌పై టీచర్లకు ఓరియంటేషన్**

విద్యారణ్యపురి: ఇన్‌స్పైర్ మనాక్ అవార్డుల నమోదుకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు సంబంధిత ఉపాధ్యాయులకు గురువారం కాజీపేట సెయింట్ గాబ్రియల్ పాఠశాలలో ఓరియంటేషన్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి తెలిపారు. మే 1 నుంచి ప్రారంభమైన ఇన్‌స్పైర్ మనాక్ నమోదుకు ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు భీమదేవరపల్లి, దామెర, హనుమకొండ, హసన్‌పర్తి, ఐనవోలు, కాజీపేట మండలాల ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఓరియంటేషన్‌కు ఆత్మకూరు, ధర్మసాగర్, ఎల్కతుర్తి, కమలాపూర్, శాయంపేట, నడికూడ, పరకాల, వేలేరు, మండలాల ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

**కేయూ ఎంసీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు**

కేయూ క్యాంపస్: ఎంసీఏ మొదటి సంవత్సరం రెండో సెమిస్టర్ (సీబీసీఎస్ రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) పరీక్షలు ఈనెల 9 తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9, 11, 14, 16, 18 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

**సీపీ జోక్యంతో భూవివాదం పరిష్కారం**

హసన్‌పర్తి: ముప్పై ఏళ్లుగా కొనసాగుతున్న అన్నదమ్ముల భూ పంచాయితీకి తెరపడింది. హసన్‌పర్తి మండలం ముచ్చర్లకు చెందిన మ్యాదరబోయిన రాజారాం, రవి, గట్టయ్య అన్నదమ్ములు. వీరికి గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. అయితే గట్టయ్యకు సంబంధించిన ఎనిమిది గుంటల భూమిని రవి కబ్జాచేసి సాగు చేస్తున్నాడు. దీంతో ఇటీవల బాధితుడు పోలీస్ కమిషనర్ రంగనాథ్ వద్దకు వెళ్లి తన గోడును చెప్పుకున్నాడు. వెంటనే విచారణ జరిపి బాధితుడికి న్యాయం చేయాలని స్థానిక పోలీసులను సీపీ ఆదేశించారు. ఈమేరకు పోలీసులు స్థానికంగా విచారణ జరిపి.. బాధితుడు గట్టయ్యకు న్యాయం చేశారు. గట్టయ్య పోలీస్ కమిషనర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశాడు.

**జిల్లాలో అదనంగా 35 పోలింగ్ కేంద్రాలు**

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్ : పోలింగ్ కేంద్రాల మార్పు విషయంలో అభ్యంతరాలుంటే గురువారంలోగా తెలియజేయాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలోని 766 పోలింగ్ కేంద్రాలకు అదనంగా 35 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 3 నియోజకవర్గాల్లో సమావేశాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 4న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని వెల్లడించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, గ్రేటర్ కమిషనర్ రిజ్వాన్ బాషా, నర్సంపేట ఆర్డీఓ కృష్ణవేణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**సమ్మె నోటీసు అందించిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు**

గీసుకొండ: వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా యాదనాయక్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న రెండో ఏఎన్ఎంలు, ఇతర సిబ్బందికి గత రెండు దశాబ్దాలుగా రెగ్యులర్ కాకుండా.. సమాన పనికి సమాన వేతనం అమలు కాకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెగ్యులర్ చేయకపోతే ఆగస్టు 15న జెండా ఆవిష్కరణ అనంతరం విధులు బహిష్కరించి సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు.

## నేటి నుంచి రెండు రైళ్లకు హోల్టింగ్

డోర్నకల్: డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో గురువారం నుంచి రెండు రైళ్లకు హోల్టింగ్ కల్పించారు. కాకినాడ–లింగంపల్లి–కాకినాడ గౌతమి ఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం–బీదర్–మచిలీపట్నం రైళ్లకు డోర్నకల్‌లో హాల్ట్ కల్పించారు. కాకినాడ–లింగంపల్లి(12737) రైలు డోర్నకల్ స్టేషన్‌కు 01.04 గంటలకు చేరుకుని 01.05 గంటలకు బయలుదేరుతుంది. లింగంపల్లి–కాకినాడ(12738) రైలు 01.09 గంటలకు స్టేషన్‌కు చేరుకుని 01.10 గంటలకు బయలుదేరుతుంది. మచిలీపట్నం–బీదర్(12749) రైలు అర్ధరాత్రి 12.36 గంటలకు చేరుకుని 12.37 గంటలకు బయలుదేరుతుండగా.. బీదర్–మచిలీపట్నం(12750) రైలు 02.18 గంటలకు చేరుకుని 02.19 గంటలకు బయలుదేరనుంది.

## ఎవరెస్టు అధిరోహణకు సహకారం అందించాలి

మరిపెడ రూరల్: వచ్చే సెప్టెంబర్‌లో ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించడానికి ప్రభుత్వం సహకారం అందించాలని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామానికి చెందిన మౌంటెయినర్ భూక్య యశ్వంత్ బుధవారం కోరారు. ఇప్పటికే జమ్మూకాశ్మీర్‌లోని ఖర్దుంగుల, దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో, హిమాచల్ ప్రదేశ్‌లోని యూనామ్, రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్ పర్వతాలను అధిరోహించినట్లు తెలిపారు. అనంతరం స్పాన్సర్‌గా ఎస్ఆర్ సాఫ్ట్‌వేర్ సొలిషియ ప్రైవేట్ లిమిటెడ్ ముందుకు వచ్చి తనను ఎవరెస్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇటీవల ముందు ఎవరెస్టు బేస్ క్యాంపును అధిరోహించి త్రివర్ణ పతకం ఎగరవేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెలలో ఎవరెస్టు శిఖరం అధిరోహించనున్నట్లు, ఇందుకు సుమారు రూ.40 లక్షలు ఖర్చు అవుతుందని వెల్లడించారు. తనది రెక్కాడితే గానీ డొక్కాడని పేద కుటుంబమన్నారు. దీనిపై ప్రభుత్వం, దాతలు స్పందించి ఆర్థిక సహకారం అందించాలని యశ్వంత్ వేడుకున్నారు.

## అదృశ్యమై.. చెరువులో శవమై..

- కోడూర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

రఘునాథపల్లి : మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పూజారి యాకస్వామి (36) నాలుగు రోజుల క్రితం అదృశ్యమై చెరువులో శవమై తేలాడు. యాకస్వామి గత నెల 30న తన పెద్ద కూతురు అక్షయకు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంత గాలించినా జాడ లేకపోవడంతో మృతుడి భార్య సరిత ఆ మరునాడే పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం గ్రామస్తులు చెరువు కట్టపై యాకస్వామి ద్విచక్రవాహనం గుర్తించారు. చెరువు చుట్టూ గాలిస్తుండగా నీళ్లలో తేలియాడుతూ మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రఘుపతి సిబ్బందితో ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు. శవం కుళ్లిపోవడంతో డాక్టర్ల బృందాన్ని అక్కడికే రప్పించి పోస్టుమార్టం నిర్వహించారు. కాగా, చెరువు కట్టపై హరితహారంలో మొక్కలు నాటేందుకు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లిన యాకస్వామికి ఈత రాకపోవడంతో చెరువులో పడి మృతి చెందినట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఎంపీడీఓ హసీం, ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీనివాస్.. ప్రభుత్వ తరపున మృతుడి కుటుంబీకులకు రూ 20 వేల ఆర్థిక సాయం అందజేశారు.




### కాల్వలో బోల్తాపడిన స్కూల్ బస్సు


గాయాలపాలైన విద్యార్థులు మణికంఠ, సిద్ధూ, ఆనంద్, చందన (ఫైల్)

ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు గత నెల 24వ తేదీన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో రోడ్డు వెంట ఉన్న కాలువలో బోల్తాపడింది. కేసముద్రస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్న 22 మంది పిల్లలను సాయంత్రం ఇంటికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రంస్టేషన్‌లోని బైపాస్ రోడ్డులో డ్రైవర్ శ్రీకాంత్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలో బోల్తాపడింది. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సులో ఇరుక్కున్న పిల్లలను బయటకు తీశారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి.

### పొలాల్లోకి దూసుకెళ్లిన బడి బస్సు

ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామం లక్ష్మీపురంలోని ట్రీ నిటీ హైస్కూల్‌లో తిమ్మాపురం, అల్లీపురం, మామునూరు, లక్ష్మీపురానికి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ఈ గ్రామాల విద్యార్థులు బడి బస్సుల్లో స్కూల్‌కు వస్తారు. గత నెల 24వ తేదీన 25 మంది పిల్లలను సాయంత్రం ఇంటికి తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయగా బస్సు అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తు విద్యార్థులు క్షేమంగా బయటపడ్డారు.


మామునూరులో పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు (ఫైల్)

# భద్రత లేని బస్సు..

**విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం**
- నిబంధనలకు నీళ్లు చల్లుతున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- అనుభవం లేని వారికి పోస్టు
- నిర్లక్ష్యం, అతివేగంతో డ్రైవింగ్
- అదుపు తప్పి బోల్తాపడడంతో ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న ఆర్టీఏ అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 2201 ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులు

ఫోకస్ సాక్షి ఫోకస్


కేసముద్రంలో బోల్తాపడిన పాఠశాల బస్సు (ఫైల్)

ఖిలా వరంగల్ : అనుభవం లేని డ్రైవర్లు.. అర్హత లేని క్లీనర్లు.. నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు.. డ్రైవర్ లైసెన్స్ ఉందా..? బస్సు కండిషన్ ఎలా ఉంది..? విద్యార్థుల భద్రకు తీసుకున్న చర్యలు ఏమిటి..? అనే విషయాల్లో నిరంతరం తనిఖీలు చేపట్టాల్సిన అధికారుల మామూళ్ల మత్తు.. వెరసి విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. రోజురోజుకూ ప్రైవేట్ స్కూల్స్, కళాశాల బస్సుల్లో ప్రయాణం దినదిన గండంగా మారుతోంది. ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఏదైనా ప్రైవేట్ పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులను తీసుకొచ్చే బస్సులను గమనిస్తే గుండె ఆగిపోవడం ఖాయం. బాక్స్‌లో అన్నం కుక్కినట్లు చిన్నారులను బస్సుల్లో కుక్కి తీసుకొస్తున్న తీరు ఆశ్చర్యపరుస్తుంది. తమ పిల్లలకు చిన్న దెబ్బ తగిలితేనే విలవిల్లాడిపోయే తల్లిదండ్రులు వారిని పాఠశాలకు తరలించే బస్సుల విషయం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బస్సు డ్రైవర్‌కు లైసెన్స్ ఉందా..? బస్సు కండిషన్‌లో ఉందా..? లేదా అనే విషయాలను పట్టించుకోవడం లేదు.

**నిబంధనలకు నీళ్లు..**

నిబంధనల ప్రకారం వాహన పరిమితికి మించి విద్యార్థులను తరలించొద్దు. అయినా ప్రైవేట్ యాజమాన్యాలు ఇవేమీ పట్టించుకోవడం లేదు. యథేచ్ఛగా నిబంధనలకు నీళ్లు చల్లుతూ పరిమితికి మించి తరలిస్తున్నాయి. ఫలితంగా బస్సులు అదుపు తప్పడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్సులకు పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) పొందడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, లైసెన్స్‌లు లేకుండానే.. తక్కువ జీతంతో అనుభవం గల బస్సు డ్రైవర్లుగా నియామకాలు చేపడుతున్నాయి. దీంతో ఆ డ్రైవర్ నిర్లక్ష్యం, ఓవర్ స్పీడ్, మద్యం మత్తు విద్యార్థుల ప్రాణాల మీదికి వస్తోంది. ఓవర్ స్పీడ్‌తో ప్రయాణించడం.. మలుపుల్లో అదుపు తప్పి బస్సులు పంటపొలాల్లోకి దూసుకెళ్లడం..బోల్తా పటడం.. విద్యార్థులు గాయాల పాలవుతున్నా అధికారులకు చలనం లేదు. దీని మూలంగా యాజమాన్యాలు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఆర్టీఏలో చేయి తడిపితేనే ఎఫ్‌సీ..**

ప్రైవేట్ విద్యా సంస్థలు చేయి తడిపితే ఆర్టీఏ అధికారులు ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం స్కూల్ బస్సులకు 31 అంశాలతో పాటు మరికొన్ని తనిఖీలు చేయాలంటే ఒక్కో బస్సుకు సుమారు 40 నిమిషాలు పడుతుంది. ఇలా ఎంవీఐ రోజుకు 10 బస్సులు తనిఖీ చేయాలి. ఈ లెక్కను ఒక ఎంవీఐకి సమారు 5 గంటలు పడుతుంది. అయితే ఉమ్మడి జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయల్లో ఎంవీఐలు ఈ విధంగా తనిఖీ చేస్తున్నారా..? అని పరిశీలిస్తే ఎక్కడా కనిపించడం లేదు. బస్సును 10 నిమిషాల్లోనే తనిఖీ చేయడం ముగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్సు కండిషన్ ఎలా ఉంది అనే విషయం పక్కన పెడుతే రూ.4 నుంచి 5వేల వరకు చేతిలో డబ్బు పెట్టగానే క్షణాల్లో చేతికి ఫిట్‌నెస్ చేరిందని కొంతమంది యాజమాన్యాలు బహిరంగాంగానే చెబుతున్నాయి. బస్సు ఫిట్‌నెస్‌కు వచ్చిందా..ఆన్‌లైన్ చేశాయిండా.. మనకు ఎన్ని డబ్బులు ముట్టాయి అనే విషయంపై ఉన్న శ్రద్ధ.. విద్యార్థుల భద్రతపై లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**స్కూల్ బోల్తాపై చర్యలు ఏవీ..?**

మొన్న కేసముద్రం మండల కేంద్రం..నిన్న మామునూరు.. నేడు మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల బొడ్లాడ గ్రామ రోడ్డుపై స్కూల్ బస్సు అదుపు తప్పి బోల్తా పడ్డాయి. బొడ్లాడలో పంట పొలాల్లో బురద ఉండటంతో ప్రాణ హానిలేదని, విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారని స్థానికులు తెలిపారు. ప్రమాదాలపై రాజకీయ జోక్యంతో మొక్కబడిగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అలసత్వం వల్లే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

**తనిఖీలు కొనసాగుతున్నాయి**



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టిసారించాం. ఫిట్‌నెస్ లేకుండా రోడ్డుపై నడిపిస్తే సీజ్ చేశాం. పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ పూర్తి చేయాలని ఎంవీఐలను ఆదేశించాం. స్కూల్ బస్సులపై తనిఖీలు చేపడుతున్నాం. సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తే చర్యలు తీసుకుంటున్నాం. ఎఫ్‌సీ పొందని బస్సుల్లో విద్యార్థులను తరలిస్తే కేసులు నమోదు చేస్తున్నాం.

– పురుషోత్తం, డీటీసీ హనుమకొండ

## ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా..

- విద్యార్థులకు స్వల్ప గాయాలు.. తప్పిన ప్రమాదం
- మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం
- బొడ్లాడలో ఘటన

దంతాలపల్లి: డ్రైవర్ నిర్లక్ష్యం.. అతివేగం వల్ల ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు అదుపు తప్పిబోల్తా పడింది. దీంతో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బొడ్లాడ సమీపంలోని జరిగింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రానికి చెందిన శ్రీ నల్లంద పాఠశాల బస్సు బుధవారం ఉదయం పెద్దముప్పారం గ్రామంలో 11 మంది విద్యార్థులను తీసుకుని బయలుదేరింది. కుమ్మరికుంట్లలో 11 మంది, దంతాలపల్లి మండలకేంద్రంలో 17 మంది తో మొత్తం 39 మంది విద్యార్థులతో బొడ్లాడ గ్రామంలో విద్యార్థులను తీసుకురావడానికి వెళ్తోంది. ఈ క్రమంలో గ్రామ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురై కేకలు పెట్టారు. గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్సై రమేష్‌బాబు ఘటనా స్థలికి చేరుకుని విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు.బస్సులో 39 మంది విద్యార్థులతో పాటు డ్రైవర్ పురుషోత్తం, క్లీనర్ అనిల్, పాఠశాల సిబ్బంది మొత్తం 42 మంది ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమి జరగక పోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



బొడ్లాడలో బోల్తా పడిన స్కూల్ బస్సు

విషయం తెలుసుకున్న ఆర్‌టీఏ అధికారులు బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర‌రెడ్డి ఘటనా స్థలికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఘటన జరిగిన అనంతరం పెద్దముప్పారం గ్రామానికి చెందిన డ్రైవర్ పురుషోత్తం పారిపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**డ్రైవర్ పై కేసు నమోదు**

మండలంలోని పెద్దముప్పారం గ్రామానికి చెందిన శ్రీ నల్లంద ప్రైవేట్ పాఠశాల బస్సు డ్రైవర్ పురుషోత్తంపై బుధవారం కేసు నమోదైంది. మండలంలోని బొడ్లాడ గ్రామంలో బస్సును నిర్లక్ష్యంగా.. అతివేగంగా నడిపి బోల్తాపడానికి కారణమయ్యాడనే విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

**వరంగల్ ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..**

వరంగల్ ఉమ్మడి జిల్లాలో మొత్తం బస్సులు 2201 ఉన్నాయి. అందులో ఇప్పటి వరకు 1451 మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ పొందాయి. మిగితా 750 బస్సులు ఫిట్‌నెస్ చేసుకోవాల్సి ఉన్నా వివిధ కారణాలతో షెడ్స్ పరిమితమయ్యాయని అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో బస్సుల వివరాలు ఇలా ఉన్నాయి..

| జిల్లా | మొత్తం | ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ పొందిన బస్సులు | ఫిట్‌నెస్ కావాల్సిన బస్సులు |
|---|---|---|---|
| వరంగల్ | 309 | 256 | 53 |
| హనుమకొండ | 1047 | 598 | 449 |
| జయశంకర్ | 241 | 130 | 111 |
| జనగామ | 200 | 180 | 20 |
| మహబూబాబాద్ | 163 | 157 | 06 |
| ములుగు | 241 | 130 | 111 |
| మొత్తం | 2201 | 1451 | 750 |

## బతుకుదెరువు కోసం వెళ్తూ మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంతో భార్య మృతి
- భర్త, అత్తామామలకు తీవ్ర గాయాలు
- కుందారం సమీపంలో చెట్టును ఢీకొన్న కారు


సింధూజ మృతదేహం

లింగాలఘణపురం : బతుకుదెరువు కోసం కుటుంబ సభ్యులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం భార్యను బలి తీసుకోగా భర్త, అత్తమామలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బుధవారం మండలంలోని కుందారం సమీపంలో జరిగింది. ఈ ప్రమాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం ఉల్వనూరు గ్రామానికి చెందిన అంబాల సింధూజ (23) అక్కడికక్కడే మృతి చెందగా ఆమె భర్త అంబాల ప్రశాంత్, మామ శ్రీనివాస్, అత్త నాగమణికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై ప్రవీణ్ కథనం ప్రకారం ప్రశాంత్ తన గ్రామం పాల్వంచ మండలం ఉల్వనూరు నుంచి కారులో భార్య సింధూజ, తల్లిదండ్రులు నాగమణి, శ్రీనివాస్‌తో కలిసి హైదరాబాద్ బయలుదేరారు. కుందారం గ్రామం సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో సింధూజ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రశాంత్, శ్రీనివాస్, నాగమణికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనా స్థలికి చేరుకున్న రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ప్రవీణ్ ఆధ్వర్యంలో క్షతగాత్రులను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**మూడు నెలల క్రితమే వివాహం..**

ప్రశాంత్, సింధూజ వివాహం మూడు నెలల క్రితమే జరిగింది. స్వగ్రామంలో బతుకుదెరువు లేకపోవడంతో హైదరాబాద్‌లో సొంతకారు నడుపుకుని జీవనం సాగించేందుకు భార్య, తల్లిదండ్రులతో బయలుదేరాడు. కుటుంబ పోషణకు కావాల్సిన నిత్యావసర వస్తువులన్నీ బియ్యం, ఉప్పు, కారం, పచ్చళ్లతో పాటు కుట్టుమిషన్ వంటి సామానులన్నీ తీసుకుని వెళ్తున్నారు. ఈ క్రమంలో మృత్యువు కారు రూపంలో వచ్చి తన వెంట తీసుకెళ్లింది. ఘటనా స్థలిలో నిత్యావసర వస్తువులన్నీ చెల్లా చెదరుగా పడి ఉన్న తీరు చూసి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

**ట్రాక్టర్ పైనుంచి పడి ఒకరు..**

మహబూబాబాద్ రూరల్: ట్రాక్టర్ పైనుంచి జారిపడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం మండలంలోని మల్యాలలో జరిగింది. కురవి రెండో ఎస్సై ఆర్.నాగేశ్వరరావు కథనం ప్రకారం హనుమకొండ జిల్లాలోని వడ్డేకొత్తపల్లి ప్రాంతానికి చెందిన శివరాత్రి సోమమల్లు (42) తన కుటుంబంతో వచ్చి మహబూబాబాద్ మండలంలోని ఒక కంకర మిల్లులో జీవనోపాధి కోసం పనిచేస్తున్నారు. సొంతంగా ట్రాక్టర్ ఉండగా అందులో కంకర నింపుకొని మహబూబాబాద్ మండలంలోని సాదుతండాలో ఒకరి ఇంటి వద్ద పోసి తిరుగు ప్రయాణమయ్యాడు. మల్యాలలో ఎస్సారెస్పీ కల్వర్టుపై గల మోరీ వద్ద ఢీకొనగా ట్రాక్టర్ అదుపు తప్పగా కిందపడ్డాడు. వెంటనే స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు అనంతరం పోస్టుమార్టం జరిపించి సోమమల్లు మృతదేహాన్ని వారికి అప్పగించారు.

## విదేశీ ఉద్యోగాలకు 5న ఎన్‌రోల్‌మెంట్

కాళోజీ సెంటర్ : విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం అభ్యర్థులను ఎంపిక చేసేందుకు తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఈనెల 5న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు www.tomcom.recruitmentmanager@gmail.com సైట్ లేదా 9701732697, 7893566493, 8328602231 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.




## సీపీని కలిసిన పోలీసు అధికారులు


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పోలీసు అధికారులు

వరంగల్ క్రైం: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని పలు విభాగాలకు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. సీపీని కలిసిన వారిలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ జితేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ట్రాఫిక్ ఏసీపీ భోజరాజు, స్పెషల్ బ్రాంచ్ సెక్యూరిటీ ఏసీపీ రమేశ్‌కుమార్, సీసీఆర్‌బీ, సీటీసీ ఏసీపీలు కృష్ణ, రాంబాబు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నాయక్, వర్ధన్నపేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఖానాపూర్ ఎస్సై మాధవ్‌గౌడ్ ఉన్నారు.

## కాంగ్రెస్ డాక్టర్ సెల్ జిల్లా చైర్మన్‌గా శ్రవణ్‌కుమార్


డాక్టర్ శ్రవణ్‌కుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా కాజీపేట రహ్మత్‌నగర్‌కు చెందిన డాక్టర్ పాలూరి శ్రవణ్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ గొట్టిముక్కల విశ్వతేజేశ్వర్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు హనుమకొండలోని విశాల్ భవన్‌లో శ్రవణ్‌కుమార్‌కు డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి నియామక పత్రాన్ని బుధవారం అందజేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాజేందర్‌రెడ్డి, విశ్వతేజేశ్వర్ రావుకు శ్రవణ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాసరావు, అశోక్‌రావు, డాక్టర్ పులి అనిల్, బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, పల్లకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సత్యనారాయణ

వరంగల్ లీగల్: వరంగల్ నగరంలోని దేవాలయంలో పూజారిగా పని చేస్తున్న వ్యక్తిని హత్య చేసిన కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎం.సత్యనారాయణను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవాలయంలో పూజారిని హత్య చేసిన నిందితుడు ముస్లిం కావడంతో సంబంధిత ప్రాంతంలో మత పరమైన ఆలజడి చెలరేగింది. ఈ కేసు విచారణలో ఏమైనా లోపాలు జరిగితే మత విద్వేషాలు చెలరేగే అవకాశాలుంటాయని భావించారు. పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి మేరకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అయిన ఎం.సత్యనారాయణను మట్టేవాడ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసు నంబర్ ఎస్సీ 348/2022లో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# బతుకు భారమై బలవన్మరణాలు..

వివిధ కారణాలతో బతుకు భారమైన నలుగురు వ్యక్తులు బుధవారం బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నారక్కపేటలో ఓ యువకుడు, శాయంపేట మండల కేంద్రంలో ఓ చేనేత కార్మికుడు, పాలకుర్తి మండలం శాతపురంలో ఒకరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల గ్రామంలో మరొకరు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాలు శోక సంద్రంలో మునిగాయి.

**పెళ్లి సంబంధాలు రావడంలేదని..**

- యువకుడి ఆత్మహత్య


రాకేష్ (ఫైల్)

నల్లబెల్లి: పెళ్లి సంబంధాలు రావడం లేదని మనస్తాపం చెందిన ఓయువకుడు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నారక్కపేటలో జరిగింది. గ్రామానికి చెందిన మామిడి రాకేష్(27)కు పెళ్లి సంబంధాలు రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

**ఆర్థిక ఇబ్బందులతో చేనేత కార్మికుడు..**


శంకర్(ఫైల్)

శాయంపేట : ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన వంగరి శంకర్ (33) ఆర్థిక ఇబ్బందులు అధికమై మద్యానికి బానిసయ్యాడు. తరుచూ భార్య శృతితో గొడవ పడుతున్నాడు. మద్యం సేవించొద్దని భార్య పలుమార్లు సూచించింది. అయినా శంకర్‌లో మార్పు రాలేదు. ఈ క్రమంలో తల్లి వినోద, భార్య శృతి పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి శంకర్ మద్యం సేవించి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి భార్య శృతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

**భార్య కాపురానికి రావడం లేదని..**


వెంకన్న (ఫైల్)

పాలకుర్తి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని శాతపురంలో జరిగింది. గ్రామానికి చెందిన ఐలేని లలిత, సుధాకర్ దంపతుల పెద్ద కుమారుడు వెంకన్న(36)కు మూడు నెలల క్రితం సిరిసిల్ల జిల్లాకు చెందిన నాగలక్ష్మితో వివాహం జరిగింది. కొన్ని విషయాల్లో దంపతులు గొడవ పడ్డారు. నాగలక్ష్మి తల్లిగారింటికి వెళ్లింది. దీంతో వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. భార్యను తీసుకురావాలని మంగళవారం రాత్రి తల్లిదండ్రులతో గొడవ పడి ఇంట్లోకి వెళ్లి గడియ పెట్టకున్నాడు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బుధవారం తెల్లవారుజామున కిటికీ నుంచి చూడగా పురుగుల మందు తాగి మృతి చెంది ఉన్నాడు. దీనిపై మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

**పత్తి పంట దెబ్బతిందని..**


హరికృష్ణ (ఫైల్)

మొగుళ్లపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట దెబ్బతినడం తోపాటు తన ఇల్లు కూలిపోయిందని మనస్తానికి గురైన ఓ వ్యక్తి.. పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని కొర్కిశాలలో జరిగింది. గ్రామానికి చెందిన గడ్డం హరికృష్ణ (27) తనకున్న భూమిలో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల వర్షాలకు పంటతోపాటు తన ఇల్లు కూలిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆయన.. బుధవారం ఉదయం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఆదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.